సాక్షి
జగిత్యాల
గురువారం ׀ 9 ׀ మార్చి ׀ 2023



మల్లన్న విగ్రహ ప్రతిష్ఠాపన

మల్లాపూర్(కోరుట్ల): యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీమల్లన్నస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం నిర్వహించారు.



గురుకులం ఎదుట ధర్నా

ధర్మపురి: విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో మగ్గిడి గురుకులం ఎదుట ధర్నా చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/19.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వైభవంగా వెంకన్న రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కథలాపూర్(వేములవాడ): తక్కళ్లపల్లిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం బుధవారం కన్నులపండువగా జరిగింది. వేకువజామున దేవాలయంలో ప్రత్యేక పూజలు అందుకున్న స్వామివారు.. తర్వాత రథంపై ఆసీనులయ్యారు. ప్రధానవీధుల గుండా ఊరేగింపుగా బయలుదేరి వెళ్లారు. మహిళలు మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలికారు. సర్పంచ్ మొలిగె లక్ష్మి, ఎంపీటీసీ జిల్లా లక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్ జిల్లా సత్యం, భక్తులు పాల్గొన్నారు.

సవాళ్లను అధిగమించాలి



మహిళా న్యాయవాదులతో జడ్జి నీలిమ

జగిత్యాలజోన్: మహిళలకు నిత్యం ఎదురయ్యే సమస్యలు, సవాళ్లను ధైర్యంతో ఎదుర్కోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ సూచించారు. జిల్లా ప్రధాన న్యాయస్థానంలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా జడ్జిలు, మహిళా న్యాయవాదులు, మహిళా సిబ్బంది కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. జడ్జి నీలిమ మాట్లాడుతూ, మహిళలకు ఏ సమస్య వచ్చినా మేమున్నామన్న భరోసాను మహిళా న్యాయవాదులు కల్పించాలన్నారు. జిల్లా మొదటి అదనపు జడ్జి వీరయ్య, సబ్ జడ్జి ప్రసాద్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నీహారిక, మొదటి, రెండోఅదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌లు జితేందర్, వినిల్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముద్దం ప్రభాకర్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

డీపీవో ఆకస్మిక తనిఖీ

కథలాపూర్(వేములవాడ): స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) నరేశ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. అనంతరం పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా పథకం ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. జిల్లాస్థాయి అధికారి ఆకస్మికంగా తనిఖీ చేయడంతో అధికారులు ఆందోళనకు లోనయ్యారు. ఎంపీడీవో జనార్దన్, ఎంపీవో ఉన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో పంటల సర్వే



సర్వే తీరు పరిశీలిస్తున్న పూర్ణచందర్‌రావు

సారంగాపూర్(జగిత్యాల): సాగు పద్ధతులు, దిగుబడులపై అంతర్జాయతీ ప్రమాణాలతో సర్వే చేసట్టామని జిల్లా ముఖ్య ప్రణాళికా ధికారి పూర్ణచందర్‌రావు అన్నారు. లచ్చక్కపేట గ్రామంలో పంటల సాగు, దిగుబడులపై చేపట్టిన సర్వే తీరును ఆయన బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం సేకరించే పంటల అంచనా వివరాలు సమగ్రంగా ఉండేందుకు పీటీవో విధానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సాఫ్ట్‌వేర్ ద్వారా అర్థగణాంక ఆధ్వర్యంలో సర్వే చేపట్టామని తెలిపారు. ఏటా ప్రభుత్వం వివిధ దశల్లో పంటల దిగుబడి అంచానాలను సేకరిస్తుందని ఆయన వివరించారు.

మతం కన్నా మానవత్వం గొప్పదని..



భోజనం వడ్డిస్తున్న ఎక్బాల్

కథలాపూర్(వేములవాడ): మతం కన్నా మానవత్వం గొప్పదని చాటారు ముస్లిం నాయకుడు. హనుమాన్ దీక్షాపరులకు మధ్యాహ్న భోజనం(బిక్ష) అందించడంతో పలువురు అభినందించారు. కలిగోట గ్రామానికి చెందిన బీజేపీ మైనార్టీ సెల్ నాయకుడు ఎండీ ఎక్బాల్ బుధవారం హనుమాన్ దీక్షాపరులకు మధ్యాహ్నం వేళ భోజనం తయారు చేయించి వడ్డించారు. సుమారు 30 మంది హనుమాన్‌దీక్షాపరులకు గ్రామశివారులోని శ్రీ సత్యనారాయణస్వామి దేవాలయం వద్ద భోజనం పెట్టారు.





కేక్ కట్ చేశాక మిఠాయిలు పంపిణీ చేస్తూ సంబురాల్లో పాల్గొన్న కలెక్టర్ యాస్మిన్‌బాషా, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, అదనపు కలెక్టర్ లత, హాజరైన మహిళలు



మేడిపెల్లి : కేక్ కట్‌చేస్తున్న కొండాపూర్ గ్రామపంచాయతీ పాలకులు, అధికారులు

సృష్టికి ప్రతిసృష్టి మహిళతోనే సాధ్యం

జగిత్యాలఅగ్రికల్చర్/కోరుట్ల: జిల్లాలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ మార్కెట్ యార్డులో జరిగిన వేడుకల్లో కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, జిల్లా ప్రజాపరిషత్ చైర్ పర్సన్ దావ వసంత, అదనపు కలెక్టర్ లత తదితరులు పాల్గొన్నారు. తొలుత కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో ఉన్నతంగా ఎదిగి ఆదర్శంగా నిలవాలన్నారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రస్తుతం చాలామంది వంటింటి నుంచి ఆకాశంలో విమానాలు నడిపే స్థాయికి ఎదగడం గొప్పవిషయమన్నారు. కోరుట్లలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరిగిన మరో కార్యక్రమంలో ఎస్పీ భాస్కర్ మాట్లాడుతూ, ప్రతీ మహిళ స్వావలంబన, సాధికారిత లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. సృష్టికి ప్రతిసృష్టి చేయగలిగే శక్తి కేవలం మహిళలకే ఉందని తెలిపారు. అందుకే ప్రతీ మహిళ శక్తిస్వరూపిణీగా రూపొందాలని సూచించారు. ఈసందర్భంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన, ప్రతిభ చూపిన వారిని అతిథులు ఘనంగా సన్మానించారు.

కోరుట్ల: విద్యార్థినిని సన్మానిస్తున్న ఎస్పీ భాస్కర్



ఉపాధి జాతర

- నృసింహుని సన్నిధిలో జోరుగా చిరువ్యాపారాలు
- సుమారు 200మందికి చేతినిండా పనులు
- బడావ్యాపారులకూ రెట్టింపు ఆదాయం
- బ్రహ్మోత్సవాలు ముగిసే వరకూ క్రయవిక్రయాలు
- అడగకుండానే ఆదాయం ఇస్తున్న ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహుడు



ధర్మపురి పుణ్యక్షేత్రంలోని తాత్కాలిక దుకాణం ఎదుట వస్తు సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

ధర్మపురి: కోరిన కోరికలు తీర్చేది దేవుడు.. కానీ, ఏ కోరికలూ కోరకుండానే చిరువ్యాపారులకు చేతినిండా ఉపాధి కల్పిస్తున్నాయి ఆ దేవుని సన్నిధిలో జరిగే జాతరలు, ఉత్సవాలు.. బ్రహ్మోత్సవాలు.. ఈ కోవలోనే ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ఈనెల 3న అంగరంగ వైభవంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు.. వందలాది మంది చిరువ్యాపారులకు వరంగా మారాయి. ఈనెల 15వ తేదీ వరకు వేడుకలు జరుగనున్నాయి. వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారి దర్శనం అనంతరం తమకు అవసరమైన వస్తుసామగ్రి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. తద్వారా రూ.లక్షల్లో వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. చిన్నవ్యాపారులకు అంతోఇంతో ఆదాయం సమకూరుతోంది.

ప్రధాన ప్రాంతాల్లో వ్యాపారాలు..

- ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలను ఉపాధి మార్గంగా ఎంచుకున్న వివిధ ప్రాంతాలకు చెందిన వందలాది మంది చిరువ్యాపారులు పదిరోజుల ముందుగానే పట్టణానికి చేరుకున్నారు.
- మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ స్థలాల్లో చిన్న చిన్న డేరాలు, టేలాలు, గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు.
- పట్టణంలోని నందీకూడలి నుంచి ఆలయం వరకు, ఆలయం నుంచి గోదావరి నదీతీరం వరకు టెంట్లు, డేరాలు, చిన్నటేలాలు ఏర్పాటు చేసుకున్నారు.
- ఇందులో ప్లాస్టిక్, స్టీలు, ఇత్తడి వస్తుసామగ్రి, బొమ్మలు, చేతిగడియారాలు, గాజులు, మిఠాయిలు తదితరాలు విక్రయిస్తున్నారు.
- దాదాపు 200 మంది చిరువ్యాపారులు ఉదయం నుంచీ రాత్రివరకు వస్తు, సామగ్రి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు.
- వీరితోపాటు స్థానిక వ్యాపారులూ పెద్దఎత్తున ఉన్నారు. వీరివ్యాపారాలు కూడా బ్రహ్మోత్సవాల సందర్భంగా రెట్టింపుగా సమకూరుతోందని అంచనా.

బల్దియాకూ ఆదాయమే..

బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చే చిరువ్యాపారుల నుంచి పన్ను, లైసెన్స్ రూపంలో సుమారు రూ.50వేల వరకు ఆదాయం సమకూరుతుందని మున్సిపల్ అధికారులు తెలిపారు. మున్సిపల్ పరిధిలో గుడారాలు, తాత్కాలి షెడ్లు ఏర్పాటు చేసుకోవడంతో వాటికి పన్నురూపంలో కొంత సొమ్ము చెల్లిస్తారు. ఇందుకోసం తొలుత లైసెన్సు తీసుకుంటారు. అదేవిధంగా నందీచౌరస్తా నుంచి ఆలయం వరకు రోడ్ల వెంట ఉన్న నివాసాల యజమానులు కూడా తమ ఇళ్ల ఎదుటగల గద్దెలు, దుఖాణాల ఎదుట గల ఖాళీ స్థలాలను చిరువ్యాపారులకు అద్దెకు ఇస్తున్నారు. అయితే, వీరు చిరువ్యాపారుల నుంచి 10 రోజుల కోసం సుమారు రూ.వెయ్యి – రూ.5వేల వరకు అద్దె వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇటు మున్సిపల్, అటు స్థానికులకు చెల్లించేందుకు తమ ఆదాయంలో కొంత కోల్పోవాల్సి వస్తోందని చిరువ్యాపారులు వాపోతున్నారు.

ఇదే తొలిసారి



మా ప్రాంతం వేదములవాడలో నాది గాజుల దుకాణం. ధర్మపురిలో నృసింహుని బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఇక్కడ వ్యాపారం బాగా సాగుతుందని వచ్చిన. ఇదే నాకు తొలిసారి. అనేక రకాల గాజులు ఉన్నాయి. వ్యాపారం బాగానే జరుగుతోంది.

– ఫరీద్‌బాబా, చిరువ్యాపారి, వేములవాడ

ఏటా వస్తున్నాం



ఎక్కడ జాతరలు జరిగినా, ఉత్సవాలు జరిగినా అక్కడకు వెళ్తాం. మిఠాయిల దుకాణం నడుపుతాం. ధర్మపురిలో రూ.40వేల పెట్టుబడితో మిఠాయిల దుకాణం ప్రారంభించినాం. ఖర్చులు పోను మంచిగానే ఆదాయం వస్తోంది. పదేళ్లుగా ఏటా ఇలా చిరువ్యాపారం చేస్తున్నాం.

– అంకూస్, చిరువ్యాపారి, వేములవాడ

గడియారాల గిరాకీలేదు



నేను సుమారు 15ఏళ్లుగా గడియారాల వ్యాపారం చేస్తున్నా. ఇప్పుడు రూ.30 వేలు పెట్టుబడి పెట్టి ముంబాయిలో గడియాలు కొనుగోలు చేసినా. మొన్నటి దాకా జరిగిన జాతరల్లో విక్రయిస్తూ వచ్చిన. గతేడాదికంటే ఈసారి ధర్మపురిలో గడియారాలకు గిరాకీ బాగా తగ్గింది. అయినా బాధపడడంలేదు.

– అస్లంఖాన్, చిరువ్యాపారి, జగిత్యాల

రూ.30వేల పెట్టుబడి

నాలుగేళ్ల నుంచి ఏటా ధర్మపురికి వస్తున్నాం. బ్రహ్మోత్సవాల సందర్భంగా జనరల్ సామగ్రి విక్రయిస్తున్నాం. ఇందుకోసం ఈసారి కూడా రూ.30వేల పెట్టుబడి పెట్టాం. వ్యాపారం బాగానే జరుగుతంది. ధర్మపురి, బీర్‌పూర్, బెల్లంపల్లిలో జరిగే ఉత్సవాల సందర్భంగా కూడా అక్కడకు వెళ్తాం.

– హేమలత, చిరువ్యాపారి, వరంగల్

50 ఏళ్ల నుంచి వస్తున్న



ధర్మపురిలో జరిగే శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతరలో వ్యాపారం చేసుకునేందుకు ఏటా ఇక్కడకు వస్తున్నా. సుమారు 50ఏళ్లుగా ఇక్కడ వ్యాపారం చేసుకుంటున్నా. ఇక్కడ గొంగళి అమ్మకాలు చేస్తున్నా. నేనే సొంతంగా వీటిని తయారు చేస్తున్నా. జాతర ప్రారంభమైన తొలిరోజు నుంచి రథోత్సవం పూర్తయ్యే వరకూ గొంగళ్ల వ్యాపారం చేస్తా. రోజూ రూ.2వేల – రూ.5వేల వరకు గిరాకీ అవుతుంది.

– యాదగిరి, కామారెడ్డి

కడుపు కోతలు వద్దు



ఆరోగ్య మహిళ పథకం లోగో ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్

- తల్లులకు మంత్రి హరీష్‌రావు విజ్ఞప్తి
- గర్భసంచుల తొలగింపుపై ఆందోళన
- కరీంనగర్‌లో ఆరోగ్య మహిళ పథకం ప్రారంభం
- క్రిటికల్‌కేర్ యూనిట్‌కు శంకుస్థాపన
- ఎంసీహెచ్, డీహెచ్‌లో అదనపు పడకలు
- జిల్లా ఆస్పత్రిలో రేడియాలజీ హబ్ ప్రారంభం
- ప్రభుత్వాసుపత్రిలో ఎంఆర్‌ఐ స్కాన్‌కు హామీ
- ఆడబిడ్డల కళ్లలో ఆనందం కోసం అద్భుత పథకం
- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్‌టౌన్: ముహూర్తాల పేరుతో సిజేరియన్లు చేపిస్తే అటు తల్లికి, ఇటు బిడ్డకు నష్టాన్ని చేకూరుస్తుందని... అత్యవసరమైతే తప్ప కడుపు కోతలు చేయించవద్దని తల్లులకు వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు విజ్ఞప్తి చేశారు. కరీంనగర్‌లో అత్యధికంగా జరుగుతున్న సిజేరియన్లపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో జరుగుతున్న కాన్పుల్లో 90 శాతం సిజేరియన్లే చేస్తున్నారని వాపోయారు. తల్లి ఆరోగ్యం దెబ్బతిని భవిష్యత్తులో గర్భసంచి తొలగించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన చెందారు. వీటన్నింటిని అధిగమించేందుకే మహిళా దినోత్సవ కానుకగా రాష్ట్ర ప్రభుత్వం 'ఆరోగ్య మహిళ' పథకాన్ని ప్రకటించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అమలకానున్న ఈ కార్యక్రమం కరీంనగర్‌లో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. బుధవారం కరీంనగర్ పట్టణంలోని బుట్టి రాజారాం కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో 50 అదనపు పడకలు, మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో 100 అదనపు పడకలను, తెలంగాణ డయాగ్నోస్టిక్ అనుబంధ రెడియాలజీ హబ్‌ను ప్రారంభించారు. జిల్లా ఆసుపత్రి ఆవరణలో నిర్మాణం చేయబోయే క్రిటికల్ కేర్ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు.

పేద మహిళల కోసమే ఆరోగ్య పథకం

మార్క్‌ఫెడ్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి మహిళలు తాము పడుతున్న ఆరోగ్య సమస్యలు భర్తలకు, బయటకు చెప్పుకోవడానికి బిడియ పడుతుంటారని, కొందరు ఆర్థిక ఇబ్బందులు, మరికొందరు ఆస్పత్రిలో మగ డాక్టర్లకు సమస్యలు చెప్పుకోలేక హాస్పిటల్‌కు వెళ్లడమే మానేశారని అన్నారు. ఇలాంటి వారికోసమే ఆరోగ్య మహిళ పథకం ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. మహిళలు సాధారణంగా ఎదుర్కొనే ఎనిమిది రకాల సమస్యలకు వైద్య సేవలు, 57 రకాల పరీక్షలు చేస్తామని అన్నారు. సర్జరీలు, ఇతర అడ్వాన్స్‌డ్ వైద్య పరీక్షల కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక సెంటర్ ఏర్పాటు చేశామని, తల్లి బాగుంటేనే కుటుంబం బాగుంటుందన్న ఆశయంతో ఈ పథకం ప్రారంభిస్తున్నామన్నారు. జిల్లా ఆస్పత్రిలో ఎంఆర్‌ఐ స్కాన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ఆడబిడ్డ కళ్లలో ఆనందం చూడాలని..

రాష్ట్ర పౌరసరఫరాలు, బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ ఆడబిడ్డ కళ్లల్లో ఆనందం చూడాలని ఆరోగ్య మహిళ అనే అద్భుతమైన పథకం చేపట్టిన ఘనత సీఎం కేసీఆర్ ది అని అన్నారు. ఈ పథకాన్ని కరీంనగర్ గడ్డ నుంచి ప్రారంభించడం ఆనందంగా ఉందని, ప్రపంచంలోని ఏ దేశంలో కూడా అమలు చేయని గొప్ప పథకం ఇది అని కొనియాడారు. ఈ ఒక్కరోజు కాదు ప్రతిరోజు మహిళా దినోత్సవం కావాలని ఆకాంక్షించారు.

మహిళా అధికారులకు సన్మానం..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ శ్వేతా మహంతి, అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్, జెడ్పీ సీఈవో ప్రియాంక, డీఎంహెచ్‌వో డాక్టర్ జువేరియా, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రత్న మాల, డీఆర్‌డీవో శ్రీలత, డీసీవో శ్రీమాల, డీఎంవో పద్మావతి, రిసోర్స్ పర్సన్స్‌లను చీరసారెతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ సునీల్‌రావు, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్, కలెక్టర్ ఆర్వీ.కర్ణన్, సీపీ సుబ్బరాయుడు, అదనపు కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్ లాల్, అసిస్టెంట్ కలెక్టర్ లెనిన్, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆ నివేదికలో ఏముంది?

- బాలికల వసతి గృహంలోకి ఉద్యోగి ప్రవేశం
- నిబంధనలు అతిక్రమించి ఇంటర్వ్యూలు
- పదిరోజులైనా బాధ్యుడిపై చర్యలు లేవు!
- చూసీచూడనట్లుగా వదిలేస్తున్న అధికారులు
- ఆదినుంచీ వివాదాస్పదమవుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల తీరు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల బాలికల వసతి గృహంలోకి ఓ ఉద్యోగి దాదాపు పదిరోజుల క్రితం మద్యం తాగి వెళ్లాడు. విద్యార్థినులను క్యూపద్ధతిలో నిల్చోబెట్టి వివిధ అంశాలపై ఇంటర్వ్యూ చేశారు. ఈ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. స్పందించిన ప్రిన్సిపాల్.. వసతి గృహంలో ఏం జరుగుతోందనే విషయం తెలుసుకునేందుకు ఇద్దరు డాక్టర్లతో కూడిన కమిటీ నియమించారు. బాలికల హాస్టల్‌కు ఆ ఉద్యోగి ఎందుకు వెళ్లారు, విద్యార్థినులను ఏ విషయం గురించి అడిగారు, అసలు ఆరోజు అక్కడ ఏం జరిందనే సమగ్ర సమాచారం సేకరించాలని కమిటీని ఆదేశించారు. బాధ్యులపై చర్యలు ఏమోగానీ.. అసలు నివేదికలో ఏముందనే విషయం ఇంకా బయటకు రావడంలేదు.

ఉద్యోగిని కాపాడే యత్నం?

- హాస్టల్‌లోకి వెళ్లి వివాదంలో చిక్కుకున్న ఆ ఉద్యోగిని కాపాడేందుకు కొందరు యత్నిస్తున్నట్లు తెలిసింది.
- బాలికల వసతి గృహంలోకి ఇతరులెవరూ వెళ్లకూడదనే నిబంధనలు ఉన్నా.. ఆ ఉద్యోగి లోనికి ప్రవేశించడం, విద్యార్థినులను ఇంటర్వ్యూ చేయడం, ఈసందర్భంగా భోజనం, ఇతర అంశాల గురించి ప్రశ్నలు సంధించడం వివాదాస్పదమయ్యాయి.
- మరోవైపు.. అనుమతి లేకుండా హాస్టల్‌లోకి వెళ్లడం సమంజసం కాదని చెబుతూనే మెడికల్ కాలేజీకి ఏమైనా సమస్యలు ఎదురవుతాయనే ఉద్దేశంతో విద్యార్థినులు కమిటీ ఎదుట ఏ విషయాలూ చెప్పలేదని కొందరు కళాశాల అధికారులు వివరిస్తున్నారు.
- విచారణ కమిటీ కూడా ఇదే విషయాన్ని నివేదికలో పొందుపర్చినట్లు సమాచారం.
- ఇప్పటికే ఓ డాక్టర్ మద్యం తాగి కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌తో గొడవ పడ్డారు.
- దీనిపై బాధితుడు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించినా.. వైద్య కళాశాలకు ఎలాంటి చెడ్డపేరు రావొద్దనే ఉద్దేశంతో కాలేజీ అధికారులు రంగంలోకి దిగారు.
- బాధితుడి నుంచి ఫిర్యాదును వెనక్కి తీసుకునేలా చర్యలు తీసుకున్నారు.
- మరోసారి నలుగురు వ్యక్తులు రాత్రిపూట కాలేజీలోకి చొరబడగా ఎస్పీకి ఫిర్యాదు వెళ్లింది.
- అయినా, ఆ నలుగురి విషయంలో ఇప్పటివరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.



జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల

ఆదినుంచీ వివాదాలే..

స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో 150 మంది వైద్య విద్యార్థులతో ఈ విద్యా సంవత్సరమే బోధనా తరగతులు ప్రారంభమయ్యాయి. అప్పటినుంచే చిన్న చిన్న గొడవలు జరుగుతున్నాయి. అయితే, ప్రతీ వివాదాన్ని సర్దుకు పోయేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అంతేతప్పితే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలేదు. అందుకే కళాశాలలో తరచూ గొడవలు జరుగుతున్నాయని, అపరిచితులు, నిబంధనలు అతిక్రయిస్తూ ఉద్యోగులు వివాదాల్లో చిక్కుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. కాగా, అనుమతిలేకుండా గర్ల్స్ హాస్టల్‌లోకి ప్రవేశించిన ఉద్యోగిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రిన్సిపాల్ శివరాంప్రసాద్‌ను సంప్రదించగా.. విచారణ కమిటీ రూపొందించిన నివేదిక వచ్చిందన్నారు. త్వరలోనే తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు.

క్లుప్తంగా

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



పరామర్శిస్తున్న వివేక్ వెంకటస్వామి

పెగడపల్లి : మండలంలోని బతికపల్లి శివారు గ్రామం.. పుల్లయ్యపల్లిలో నాలుగు రోజుల కింద జరిగిన షార్ట్‌సర్క్యూట్‌తో నష్టపోయిన అడుప అనసూర్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గడ్డం వివేక్ వెంకటస్వామి డిమాండ్ చేశారు. బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితురాలికి డబుల్ బెడ్ రూం ఇల్లుతో పాటు ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతకు ముందు మండల కేంద్రంలోని శివాలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రెడ్డి సంక్షేమ కల్యాణ మండప నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఆయనవెంట నియోజకవర్గం ఇన్‌చార్జి సత్యం, బీజేపీ మండలాధ్యక్షుడు కొమురెల్లి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనసూర్య, జిల్లా అధికార ప్రతినిధి సత్యం, నాయకులు మోహన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, తిరుపతి, బాబు, రమేశ్, పరశురాం, పవన్, కరుణాకర్, మధుకర్ తదితరులున్నారు.

వృద్ధురాలిని కాపాడిన బ్లూ కోల్ట్ కానిస్టేబుల్



లక్ష్మణ్, బ్లూకోల్ట్ కానిస్టేబుల్‌ను అభినందిస్తున్న ఎస్పీ

జగిత్యాల క్రైం: కెనాల్‌లో దూకేందుకు యత్నించిన ఓ వృద్ధురాలిని బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ కాపాడాడు. వివరాల్లోకి వెళితే.. జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధరూర్ కెనాల్ వద్ద కొడిమ్యాల మండలం కొండాపూర్‌కు చెందిన వృద్ధురాలు ఎస్సారెస్పీ కెనాల్‌లో దూకేందుకు యత్నించింది. గమనించిన చిరువ్యాపారి కుడుకల లక్ష్మణ్ డయల్ 100కు సమాచారం అందించాడు. బ్లూకోల్ట్ కానిస్టేబుల్ నరేశ్ అక్కడికి చేరుకొని వృద్ధురాలిని కాపాడాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించాడు. ఈ సందర్భంగా కుడుకల లక్ష్మణ్, బ్లూకోల్ట్ కానిస్టేబుల్ నరేశ్‌ను జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ ఎగ్గడి భాస్కర్ సన్మానించారు.

నిజాయితీ చాటుకున్న విద్యార్థులు

- దొరికిన బంగారు చైన్ అప్పగింత..



చైన్‌ను అందజేస్తున్న ప్రిన్సిపాల్ నరేశ్

కథలాపూర్: మండలంలోని మోడల్‌స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు తమకు దొరికిన బంగారు చైన్‌ను ఉపాధ్యాయులకు అందించి నిజాయితీ చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే...ఆదర్శ పాఠశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదివే అభినయకు చెందిన తులం బంగారు చైన్ బుధవారం పాఠశాల ఆవరణలో పడిపోయింది. కాసేపటికి ఎనిమిదో తరగతి చదువుతున్న ధనుష్, వంశీ అనే విద్యార్థులకు కనిపించడంతో ఉపాధ్యాయులకు అందజేశారు. ప్రిన్సిపాల్ నరేశ్ చేతులమీదుగా బంగారం చైన్‌ను తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థినికి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఉత్తమ ఫలితాలకు అభ్యాస దీపికలు



చిట్టాపూర్‌లో ప్రత్యేక తరగతుల నిర్వహణ



విద్యార్థులకు అందజేసిన అభ్యాస దీపికలు

- ప్రభుత్వ పాఠశాలల్లోని
- 'పది' విద్యార్థులకు పంపిణీ
- నాలుగు సబ్జెక్టులతో ప్రత్యేక రూపకల్పన
- వెనుకబడిన విద్యార్థులకు ఉపయోగం

మల్లాపూర్ : ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి వార్షిక పరీక్షా పేపర్లను 11 నుంచి ఆరుకు కుదించారు. దీంతో విద్యార్థులు పట్టు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులు సైతం ఉత్తీర్ణత, ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యాశాఖ ప్రత్యేక అభ్యాస దీపికలు అందజేసింది. వార్షిక పరీక్షలకు సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు శ్రమిస్తున్నారు. అల్పాహారం అందిస్తూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. తాజాగా నాలుగు సబ్జెక్టులపై పట్టు సాధించేలా అభ్యాస దీపికలు ముద్రించారు. ఒక్కో పుస్తకంలో 88–132 పేజీలు ఉన్నాయి. వాటిని జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు అందించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఇవి ఎంతగానో ఉపయోగకరంగా ఉన్నాయి. పదో తరగతిలో గతంలో 11 పేపర్లు ఉండగా, ఒక పేపర్‌లో మార్కులు తక్కువ వచ్చినా మరో పేపర్‌లో ఎక్కువ మార్కులు సాధించి ఉత్తీర్ణులయ్యేవారు. ఈ ఏడాది ఆరు పేపర్లే ఉండనున్నాయి. ఒక్కో సబ్జెక్టుకు ఒకే పేపర్ ఉండడంతో వందశాతం ఫలితాలు సాధించాల్సిందే.!

జిల్లాలో 11,117 మంది విద్యార్థులు

జిల్లాలో 187 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 14 కేజీబీవీలు, 13 మోడల్ స్కూళ్లు, 19 గురుకుల, రెసిడెన్షియల్, సంక్షేమ ఉన్నత పాఠశాలలుండగా 11,117 మంది పదో తరగతి విద్యార్థులు చదువుతున్నారు. వార్షిక ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో అభ్యాస దీపికలు అందించారు. గణితం, భౌతిక రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘికశాస్త్రం సబ్జెక్టులను తెలుగు, ఆంగ్ల, ఉర్దూ మాధ్యమంలో ముద్రించారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఆదర్శ, కేజీబీవీ, గురుకుల పాఠశాలల విద్యార్థులకు అందజేశారు. వాటిని విద్యార్థులతో చదివించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. ఇందులో భాగంగా పుస్తకంలోని చాప్టర్ల వారీగా ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరిస్తున్నారు.

జగిత్యాల జిల్లా వివరాలు :

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు	:187
కేజీబీవీలు	:14
మోడల్ స్కూళ్లు	:13
గురుకుల, రెసిడెన్షియల్, సంక్షేమ పాఠశాలలు	:19
పదో తరగతి విద్యార్థులు	:11,117

చదివేందుకు సులువు..



అభ్యాస దీపకలో సులువైన ప్రశ్నలు ఉన్నాయి. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. మెయిన్ పాయింట్స్ మాత్రమే ఉండడంతో చదివేందుకు ఎంతో సులువుగా ఉంది.

–నవీన్, పదో తరగతి విద్యార్థి, జెడ్పీ హైస్కూల్, చిట్టాపూర్

అధిక మార్కులు సాధించవచ్చు



పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలు సులువుగా రాసేందుకు అభ్యాస దీపికలు ఎంతగానో దోహదపడతాయి. ముఖ్యమైన సమాచారమంతా వీటిలో ఉంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వాటిని అందించాం. దీంతో ఇవి చదవడం అధిక మార్కులు సాధించవచ్చు.

–జగన్మోహన్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి, జగిత్యాల

రేవంత్‌రెడ్డి యాత్రను విజయవంతం చేయాలి

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి : ఈనెల 10న జగిత్యాల జిల్లాలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేపట్టే హాథ్ సే హాథ్ జోడో యాత్రను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ధర్మపురిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలిసి రేవంత్ రెడ్డి పాదయాత్ర నిర్వహిస్తారన్నారు. మొదట జగిత్యాల సమీపంలోని చెలిగల్ నుంచి పాదయాత్రగా బయలుదేరి పట్టణంలోని గాంధీనగర్, మంచినీళ్ల బావి, తీన్‌ఖాన్ చౌరస్తా, టవర్ సర్కిల్ మీదుగా కొత్తబస్టాండ్ సర్కిల్ వరకు పాదయాత్ర ఉంటుందని తెలిపారు. అనంతరం కొత్త బస్టాండ్ సెంటర్‌లో బహిరంగ సభ జరుగుతుందన్నారు. నాయకులు, పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ దినేశ్, ఉపాధ్యక్షుడు వేముల రాజేశ్, నాయకులు సింహరాజు ప్రసాద్, సీపతి సత్యనారాయణ, కుంట సుధాకర్, శ్రవణ్, రఫీయొద్దీన్, గణేశ్, తదితరులున్నారు.

పెద్ద ఎత్తున పాల్గొనాలి

పెగడపల్లి: హాథ్ సే హాథ్ పాదయాత్రలో భాగంగా ఈనెల 9న కరీంనగర్, 10న జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే మహాసభలను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాల్గొనే బహిరంగ సభలో కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, సర్పంచ్ ఈరెల్లి శంకర్, ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, తడగొండ రాజు, రాకేశ్‌యాదవ్, లక్ష్మీరాజం, సత్తయ్య, బలరాం రెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

సాగునీటి విడుదల



నీరు విడుదల చేస్తున్న నాయకులు

వెల్గటూర్(ధర్మపురి): ఎండపల్లి మండలం ముంజంపల్లి, మారేడ్‌పల్లి, ఉండెడ గ్రామాల పరిధిలోని ఆయకట్టుకు బుధవారం సాగునీరు విడుదల చేశారు. గ్రామానికి చెందిన రైతు వ్యాళ్ల రాంరెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని కలిసి నీళ్లు అందక పంటలు ఎండుతున్నాయని రైతులు కొద్దిరోజుల క్రితం విన్నవించారు. అయితే, పంటలకు సాగునీరు అందిస్తామని మంత్రి వారికి మాట ఇచ్చారు. ఈమేరకు ఈఎన్‌సీ వెంకటేశ్వర్‌రావుతో మాట్లాడి సాగునీరు విడుదల చేయాలని ఆదేశించారు. సాగునీరు విడుదల కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎల్‌ఎండీలో స్నానానికి వెళ్లి యువకుడి మృతి

- మృతుడు ఉత్తరప్రదేశ్ కూలీ

కొత్తపల్లి(కరీంనగర్): మండలంలోని ఎలగందుల శివారు ఎల్‌ఎండీలో స్నానానికి వెళ్లి, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ కూలీ మృతి చెందినట్లు ఎస్సై బి.ఎల్లయ్యగౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణానగర్‌కు చెందిన చోటు కుమార్(20), మరికొందరు కొత్తపల్లి మండలంలోని బావుపేట కేదారి గ్రానైట్ కంపెనీలో రేకుల షెడ్డు వేయడానికి వచ్చారు. మంగళవారం హోలీ వేడుకల్లో పాల్గొని, ఎల్‌ఎండీలో స్నానం చేయడానికి వెళ్లారు. కుమార్‌కు ఈత రాకపోవడంతో నీటిలో మునిగి, మృతిచెందాడు. అతను ఈత రాక చనిపోయినట్లు ఉత్తరప్రదేశ్‌కు చెందిన సునీల్ యాదవ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మహిళా సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



ఆరోగ్య కేంద్రంలో ఎమ్మెల్యే సంజయ్, కలెక్టర్ యాస్మిన్‌బాషా, పేషెంట్లు

జగిత్యాల: మహిళా సంక్షేమంపై బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక గాంధీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేపట్టిన మహిళా ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ యాస్మిన్‌బాషాతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఆరోగ్య కేంద్రంలో 8 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మహిళల ఆరోగ్యం కాపాడటమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా సీఎం కేసీఆర్ మహిళల పక్షాన నిలబడుతున్నారని అన్నారు. ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కలెక్టర్ యాష్మిన్ బాషా మాట్లాడుతూ, జిల్లాలో ఐదు కేంద్రాల్లో ఆరోగ్య మహిళా పథకం ప్రారంభించామన్నారు. మహిళల్లో జన్యుపరమైన వ్యాధులను గుర్తిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, అడిషనల్ కలెక్టర్లు లత, మకరంద్, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, డీఎంహెచ్‌వో శ్రీధర్, కౌన్సిలర్ బాలె లత, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, దామోదర్‌రావు, ఆనందరావు, గంగాధర్ పాల్గొన్నారు.

ప్రజలు కాంగ్రెస్ వైపే..

- హాథ్ సే హాథ్‌ను విజయవంతం చేయాలి
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: సీఎం కేసీఆర్ మోసపు మాటలు నమ్మే రోజులు పోయాయని, రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ వైపే చూస్తున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డులో హాథ్ సే హాథ్ జోడో సన్నాహక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 10న(శుక్రవారం) జిల్లా కేంద్రంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టే హాథ్ సే హాథ్ జోడోయాత్రను విజయవంతం చేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చే వరకూ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. రేవంత్‌రెడ్డికి ఘనస్వాగతం పలికేందుకు ప్రజలను భారీగా తరలించాలని సూచించారు. అనతరం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మిని శాలువాతో సత్కరించారు. పీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి బండ శంకర్, సభ్యులు గిరి నాగభూషణం, నాయకులు కల్లెపెల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా బీఆర్ఎస్, బీజేపీ పాలన

సారంగాపూర్(జగిత్యాల): కాంగ్రెస్ పాలనకు ప్రస్తుత బీఆర్ఎస్, బీజేపీ పాలన మధ్య తేడాను ప్రజలకు వివరించే బాధ్యతను పార్టీ కార్యకర్తలు తీసుకోవాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సూచించారు. లక్ష్మీదేవిపల్లిలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ పాలనలో కేంద్రప్రభుత్వం సిలిండర్ ధరను పెంచితే ఆ భారాన్ని రాష్ట్రప్రభుత్వం భరించిందని గుర్తుచేశారు. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం గ్యాస్ ధర పెంచిందని, రాష్ట్రప్రభుత్వం కొంతభారం భరిస్తే ప్రజలు సంతోషించేవారని అన్నారు. ఎమ్మెల్సీ కవిత లిక్కర్‌స్కామ్‌లో ఉండడం శోచనీయమన్నారు. నాయకులు ఇమామ్, భూతగడ్డ రాజం, గోపు శ్రీధర్, ముత్యానూరి రాజనర్సు, కుడుకల శంకర్, పిట్టల శేఖర్, ఏలేటి అనందరెడ్డి, మేడిపల్లి రమణారెడ్డి, మానేరు ముత్యాలు, యాంగి గంగరాజం, రాజకొండ గంగరాజం, పసుల రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

ధర్మపురి : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవా ల్లో ఆరవ రోజైన బుధవారం ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ దేవాలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక క్యూలైన్ల ద్వారా స్వామివార్లను దర్శించుకున్నారు.

పట్టణ పురవీధులు శుభ్రం..

బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టణంలోని పురవీధులన్నీ శుభ్రంగా మారాయి. మున్సిపల్ కమిషనర్ రమేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరం చేశారు. భక్తులకు ఇబ్బందులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు..

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమాల్లో దేవస్థానం ఈవో శ్రీనివాస్, విశ్రాంత ప్రిన్సిపాల్ సంగనభట్ల నర్సయ్య, కొరిడె నరహరి శర్మ, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, రేనవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

సారంగాపూర్: ఓ వ్యక్తిపై దాడికి దిగిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మనోహర్‌రావు తెలిపారు. మండలంలోని రంగపేట గ్రామానికి చెందిన బోయిని నర్సయ్య, ఆయన బావ రాజు మధ్య గొడవ జరగగా అక్కడే ఉన్న పురుమల్ల రవి ఇద్దరిని గొడవపడకుండా ఆపేందుకు ప్రయత్నించాడు. దీంతో నర్సయ్య, ఆయన తల్లి సత్తవ్వ రవిపై కర్రతో దాడిచేయగా గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు నర్సయ్య, సత్తవ్వపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కడుపునొప్పి భరించలేక గర్భిణి ఆత్మహత్య

- మృతురాలు అడ్వకేట్
- మహిళా దినోత్సవం రోజు గంగానగర్‌లో విషాదం



పుష్పలత (ఫైల్)

గోదావరిఖని(రామగుండం): మహిళా దినో త్సవం రోజు ఓ గర్భిణి ఆత్మహత్య చేసుకోవడం గోదావరిఖని గంగానగర్‌లో విషాదం నింపింది. వివరాల్లోకి వెళ్తే.. గంగానగర్‌కు చెందిన బరిగెల పుష్పలత (33) భర్త, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. ఆమె ప్రస్తుతం 4 నెలల గర్భిణి. కొన్నేళ్లుగా అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేస్తోంది. ఈ క్రమంలో కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఎన్ని ఆసుపత్రులకు వెళ్లి, చికిత్స పొందినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైంది. బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుంది. మృతురాలి తల్లి ఆశమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వామి పేర్కొన్నారు.

2018 నాటి కేసులో 25 మందికి జరిమానా

మంథని: 144 సెక్షన్ అమలులో ఉండగా ధర్నా నిర్వహించి, ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించిన కేసులో బుధవారం మంథని కోర్టు న్యాయమూర్తి 25 మందికి రూ.1,000 చొప్పున జరిమానా విధించారని పోలీసులు తెలిపారు. 2018 మార్చి 13న మంథని అంబేడ్కర్ చౌరస్తాలో చేపట్టిన ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్, ఇతర పార్టీలకు చెందిన 27 మందిపై కేసు నమోదైందని పేర్కొన్నారు. వీరిలో ఇద్దరు మృతిచెందగా మిగతా 25 మందిని కోర్టులో హాజరుపరిచామన్నారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని తెలిపారు.

జీజీహెచ్‌లో మహిళా పేషెంట్‌కు తీవ్ర గాయాలు

- ఆసుపత్రి రెండో అంతస్తు పైనుంచి పడటంతో ఘటన
- కరీంనగర్ తరలించిన వైద్యులు



బాధితురాలికి ప్రథమ చికిత్స అందిస్తున్న సిబ్బంది

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్) రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు ఓ మహిళా పేషెంట్ కింద పడింది. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. గోదావరిఖనిలోని ఎల్బీనగర్‌కు చెందిన పైడిపెల్లి సరోజన జ్వరం, ఫిట్స్ తదితర అనారోగ్య సమస్యలతో మంగళవారం దవాఖానాకు వచ్చింది. వైద్యులు పరీక్షించి, ఇన్‌పేషెంట్‌గా అడ్మిట్ చేసుకున్నారు. ఆమెకు తోడుగా భర్త రవీందర్ ఉన్నాడు. ఆసుపత్రి రెండో అంతస్తులోని వార్డులో ఉన్న సరోజన బుధవారం తెలవారుజామున 5.30 గంటల సమయంలో బాత్‌రూంకు వెళ్లడానికి మెట్ల వద్దకు వచ్చింది. అకస్మాత్తుగా అక్కడి నుంచి కింద పడింది. పెద్ద శబ్దం రావడంతో ఉలిక్కిపడిన ఆమె భర్త, వైద్య సిబ్బంది వెంటనే వెళ్లి చూశారు. తీవ్రంగా గాయపడిన సరోజనను ఎమర్జెన్సీ వార్డుకు తరలించి, ప్రథమ చికిత్స అందించారు. తలకు కుట్లు వేసిన అనంతరం బాధితురాలిని వైద్యులు కరీంనగర్‌లోని చల్మెడ ఆసుపత్రికి తరలించారు. ఆమె రెండో అంతస్తు నుంచి ఎలా పడిందో ఎవరూ సరిగా చెప్పలేకపోతున్నారు. ఈ సంఘటనతో ఇన్‌పేషెంట్లు ఆందోళనకు గురయ్యారు.

ఇద్దరికి గాయాలు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర, ఓ వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరు గ్రామానికి చెందిన ఆరెల్లి స్వరూప బుధవారం ఆటోలో పోతన కాలనీ నుంచి అల్లూరుకు వస్తోంది. పోతన కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డులో గల పెట్రోల్ బంక్ సమీపంలో దిగింది. గ్రామానికి వెళ్లేందుకు నడుచుకుంటూ రోడ్డు దాటుతోంది. ఈ క్రమంలో మద్యం మత్తులో కాలనీ వైపు నుంచి ద్విచక్రవాహనదారుడు అతివేగంగా వస్తున్నాడు. ఆ బైక్‌ను తప్పించే క్రమంలో వెనక నుంచి వస్తున్న ఆటో స్వరూపను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె తల, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనాదారుడు కూడా కింద పడటంతో అతనికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను స్థానికులు 108 వాహనంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. ఆటోతోపాటు ద్విచక్రవాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

వృద్ధురాలి కంట్లో కారం కొట్టి..

- మెడలోని బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన దొంగలు



వృద్ధురాలు దేవవ్వ

కోనరావుపేట (వేములవాడ): వృద్ధురాలి కంట్లో కారంకొట్టి మెడలో ఉన్న బంగారు గొలుసును దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పల్లిమక్తకు చెందిన కుడుకుల దేవవ్వ–సిద్ధయ్య వృద్ధ దంపతులు. ఇంట్లో ఇద్దరే ఉంటారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో వృద్ధురాలి ఇంట్లో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి కరెంట్ సరఫరా నిలిపివేశారు. సిద్ధయ్య పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లగా వృద్ధురాలి కంట్లో కారంపొడి చల్లి మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై రమాకాంత్ డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంతో చేరుకొని ఆధారాలు సేకరించారు. కాగా అనుమానితులుగా భావిస్తున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

యువకుడికి ఏడాది జైలు

జగిత్యాల జోన్ : ప్రేమిస్తున్నానంటూ ఓ యువతిని వేధింపులకు గురిచేస్తున్న యువకుడికి ఏడాది జైలుతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా ఫోక్సో కోర్టు జడ్జి, జగిత్యాల మొదటి అదనపు జిల్లా జడ్జి వీరయ్య బుధవారం తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలత్రిపుర సుందరి తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి ఇంటర్మీడియట్ చదువుతుండగా అదే గ్రామానికి చెందిన మేదరి గణేశ్ అనే యువకుడు సదరు యువతిని ప్రేమిస్తున్నానంటూ ఇబ్బందులకు గురిచేశాడు. విషయాన్ని యువతి తన తల్లిదండ్రులకు తెలుపగా గణేశ్‌ను మందలించారు. అయినా తన ప్రవర్తనలో మార్పురాలేదు. 2016 ఏప్రిల్ 20న సదరు యువతి తన తల్లిదండ్రులతో కలిసి మల్యాలలో జరిగే ఓ శుభకార్యానికి వెళ్తుండగా వెంటపడ్డాడు. దీంతో తల్లిదండ్రులతో కలిసి జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ, ప్రస్తుత సీఐ ఆరిఫ్ అలీఖాన్ కేసు నమోదు చేసి గణేశ్‌పై కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ బృందం సభ్యులు జి. రామకృష్ణ, బి. రాజు, కిరణ్‌కుమార్ సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టగా గణేశ్‌కు ఏడాది జైలుతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



మాదాసు వినయ్ (ఫైల్)

రాయికల్: తండ్రి మందలించాడని రాయికల్ పట్టణానికి చెందిన మాదాసు వినయ్ అనే యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 6న రాయికల్‌కు చెందిన మాదాసు వినయ్ (19)ను తండ్రి లక్ష్మయ్య మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన వినయ్ పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి సోదరుడు వివేక్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.